కాంగ్రెస్‌కు ఓటమి భయం!

- క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత
- కోడ్ వల్ల మాట నిలబెట్టుకోలేదని ముఖ్యమంత్రి వివరణ
- ఎన్నికల తర్వాత రుణమాఫీ చేస్తామని తాజాగా హామీ
- పార్లమెంట్ ఎన్నికల గండం గట్టెక్కేది ఎలా?
- పీసీసీలో గుబులు.. అధిష్ఠానంలో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కనీసం 15 లోక్‌సభ స్థానాలను గెలవాలని ఏఐసీసీ, 14 సీట్లు గెలిచితీరుతామని పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ అటు ఏఐసీసీ ఆశాభావం, ఇటు పీసీసీ ధీమాకు తగిన ట్టుగా క్షేత్రస్థాయిలో పరిస్థితి లేదని పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు ప్లాష్ సర్వేలో తేలినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ 14-15 సీట్లు గెలుచుకునే పరిస్థితి లేదని ఆ సర్వే తేల్చినట్టు చెప్తున్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే మెజార్టీ సీట్లు గెలిచే పరిస్థితి లేదన్న సమాచారం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని షాక్‌కు గురిచేసింది. దీంతో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ హుటాహుటిన హైదరాబాద్‌కు పరుగెత్తుకొచ్చి పీసీసీ నాయకత్వం, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జీలు, అభ్యర్థులతో సమావేశమైనట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే ప్రభుత్వం పట్ల ప్రజలలో, ముఖ్యంగా రైతులలో తీవ్ర వ్యతిరేకతకు కారణం ఏమిటని కేసీ వేణుగోపాల్ ఆరా తీసినట్టు ఈ వర్గాల సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడమే ప్రజలలో వ్యతిరేకతకు కారణమని అధిష్ఠానం గుర్తించింది. సునీల్ కనుగోలు టీమ్ తాజాగా ఎంపీ నియోజకవర్గాల వారీగా నిర్వహించిన ప్లాష్ సర్వే నివేదికలోనూ అదే తేలినట్టు సమాచారం. దీంతో ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఏర్పడిన వ్యతిరేకతను ఏ విధంగానైనా అధిగమించి మెజార్టీ స్థానాలు గెలిచితీరాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, ఎంపీ సెగ్మెంట్లకు ఇన్‌చార్జీలుగా ఉన్న మంత్రులు, ఇతర నేతలను వేణుగోపాల్ ఆదేశించారు. ఉత్తరాది కంటే దక్షిణాదిలో అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణతోపాటు తమిళనాడులో డీఎంకేతో పొత్తుతో, కేరళలో ఎక్కువ ఎంపీ సీట్లు గెలుచుకోవాలన్నది అధిష్ఠానం టార్గెట్ అని వేణుగోపాల్ రాష్ట్ర నాయకత్వానికి వివరించారని తెలిసింది.

ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత

తమ అంచనాలకు భిన్నంగా తెలంగాణలో ప్రభుత్వం పట్ల ప్రజలలో అప్పుడే ఎందుకు వ్యతిరేకత వచ్చింది? అందుకుగల కారణాలు ఏమిటో గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపడితే తప్ప మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకునే పరిస్థితి లేదని కేసీ వేణుగోపాల్ వివరించినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే ప్రజలలో విశ్వాసం సన్నగిల్లడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో కాకుండా పాక్షికంగా అమలు చేయడమే ప్రధాన కారణమని సర్వేలో తేలిన విషయాన్ని కూడా రాష్ట్ర నాయకత్వానికి వివరించినట్టు తెలిసింది. దీనికి తోడు సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు మధ్య సమన్వయ లోపం, రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం కారణంగా ఉత్పన్నమైన పరిస్థితులు, ధాన్యం కొనుగోలు అంశంలో ప్రభుత్వం నుంచి రైతన్నలకు భరోసా కల్పించకపోవడం, మంచినీటి ఎద్దడి తదితర అంశాలు ప్రజలలో వ్యతిరేకతకు కారణమని అధిష్ఠానానికి అందిన నివేదికను వేణుగోపాల్ వివరించినట్టు తెలిసింది. వాస్తవ పరిస్థితి ఈ విధంగా ఉంటే, అధికారంలో ఉన్నాం కాబట్టి మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకుంటామన్న ఓవర్ కాన్ఫిడెన్స్ వద్దని, అసెంబ్లీ ఎన్నికలప్పటి పట్టుదల, ఉత్సాహం పార్టీ నాయకత్వంలో, శ్రేణులలో కొరవడిందని ఈ ప్రభావం ఎంపీ ఎన్నికలపై పడే ప్రమాదం లేకపోలేదని అధిష్ఠానం హెచ్చరించినట్టు సమాచారం. మరోవైపు పార్టీలో కొత్తగా చేరిన నాయకులు, పాత వారికి మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని, అందుకు సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాలే ఉదాహరణ అని ఆయన గుర్తు చేసినట్టు తెలిసింది. ఈ నియోజకవర్గాల నుంచి అభ్యర్థులుగా బరిలోకి దిగిన దానం నాగేందర్, సునీతా మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ప్రచారంలో ప్రత్యర్థుల కంటే వెనకబడి ఉన్నారని గుర్తు చేసినట్టు సమాచానం. అసెంబ్లీ ఎన్నికలలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలుచుకోలేదని, ఆ లోటును తీర్చడానికి ఈ మూడు ఎంపీ స్థానాలను ఎట్టి పరిస్థితులలో గెలిచితీరాల్సిందేనని వేణుగోపాల్ ఆదేశించినట్టు తెలిసింది. ఇక్కడి నుంచి పోటికి పార్టీ నాయకులు ఆసక్తి చూపినప్పటికీ వారిని పక్కన పెట్టి టికెట్ ఇచ్చిన విషయాన్ని మరిచిపోవద్దని ఆయన దానం నాగేందర్, రంజిత్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డికి గుర్తు చేసినట్టు తెలిసింది.

రెఫరెండం మాట ఎత్తడం లేదు

ఈ లోక్‌సభ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండం అంటూ పలుమార్లు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, తాజాగా ఆ మాటే ఎత్తడం లేదు. పైగా పేదోడి బిడ్డ సీఎం కావద్దా? ఒక రైతు బిడ్డ సీఎం అయితే ఓర్వలేకపోతున్నారు, తనను గద్దె దించడానికి ఇటు కేసీఆర్, అటు మోదీ గొడ్డలి భుజాన వేసుకొని తిరుగుతున్నారంటూ ప్రజలలో సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం నారాయణపేటలో జరిగిన జనజాతర సభలో స్పష్టమైంది. ఇది ప్రజల సానుభూతి పొందడంతోపాటు అంతకు ముందు రెఫరెండం అన్న దాని నుంచి ప్రజల దృష్టిని మరలించే ప్రయత్నంగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

తాజా సర్వే హెచ్చరికతో దిద్దుబాటు చర్యలు

తాజా సర్వే నివేదిక ప్రకారం ప్రజలలో వచ్చిన వ్యతిరేకతను అధిగమించి మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకునే లక్ష్యంగా పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. రైతులలో వ్యతిరేకతకు కారణమైన రూ.2 లక్షల రుణ మాఫీని ఎన్నికల కోడ్ కారణంగా సకాలంలో చేయలేకపోయామని, ఎన్నికలు ముగిశాక ఆగస్టు 15 కల్లా ఒకేదఫాలో అమలు చేస్తామని నారాయణపేటలో జరిగిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం దిద్దుబాటు చర్యలలో భాగమేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు, రైతులు పండించే ధాన్యానికి రూ. 5 వందల బోనస్ వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని కూడా సీఎం ప్రకటించారు. వీటిని కూడా ఎన్నికల కోడ్ కారణంగా వెంటనే చేపట్టలేకపోయినట్టు సీఎం వివరించారు. పార్టీ క్యాడర్‌లో అసెంబ్లీ ఎన్నికలప్పటి జోష్ కొరవడినట్టు సర్వేలో తేలడంతో వారిని ఉత్తేజపరిచేందుకు ఎంపీ ఎన్నికలలో కష్టపడి పనిచేసిన వారికే స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. మొత్తం మీద అధికార కాంగ్రెస్ పట్ల ప్రజలలో నెలకొన్న వ్యతిరేకతను అధిగమించి మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తున్నది.

రైతుబీమా మంజూరుకు కసరత్తు

- ఎల్ఐసీకి ఫైల్ పంపించిన అధికారులు
- నమస్తే కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ, ఏప్రిల్ 16: హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన పిట్టల సుధాకర్ మరణించినందున అతడి కుటుంబానికి రైతుబీమా వర్తించేలా చర్యలు చేపట్టినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 'పంటలకు దూరమై.. అప్పులు భారమై' అనే శీర్షికన ఈ నెల 15న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. సుధాకర్ పేరిట ఉన్న 3.20 ఎకరాల భూమికి సంబంధించి వ్యవసాయ శాఖ ద్వారా రైతుబీమా, రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నారని వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ తెలిపారు. 2023 వానకాలం, యాసంగికి సంబంధించి రైతుబంధు వర్తింపజేశామని ఆయన పేర్కొన్నారు. సుధాకర్ భార్య విజయను రైతుబీమాకే నామినీగా నమోదుచేసినట్టు చెప్పారు. పరిహారం కోసం ఫైల్‌ను ఎల్ఐసీకి పంపించినట్టు తెలిపారు.

ముఖ్య నేతలకు భద్రత పెంపు

పోలీసులకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్య నాయకులకు భద్రత పెంచారు. ఏపీలో సీఎం జగన్‌పై జరిగిన రాళ్ల దాడి నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అప్రమత్తమై ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. రాష్ట్రంలో 17 పార్లమెంట్ నియోజక వర్గాల ఎన్నికలకు ఈ నెల 18 నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని పార్టీల నాయకులు భారీ బహిరంగ సభలు, రోడ్ షోలు, పాదయాత్రలు, డోర్ టు డోర్ ప్రచారాలలో పాల్గొంటారు. ఈ క్రమంలో అసాంఘిక శక్తుల నుంచి నాయకులను కాపాడేందుకు ఎన్నికల కమిషన్ భద్రత పెంచిందని పోలీసువర్గాల సమాచారం. మంగళవారం సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్య నాయకులకు సెక్యూరిటీ పెంచిన విషయం స్పష్టంగా కనిపించింది. సభా ప్రాంగణానికి వెళ్లే దారిలో అడుగడుగునా భద్రతా సిబ్బంది చెకింగ్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సీనియర్ నేత సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోరుట్లకు చెందిన పలువురు బీజేపీ నాయకులు గాంధీభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు

గజినీలా రేవంత్‌రెడ్డి ప్రవర్తన

- ఓటమి భయంతోనే రైతుల మీద ప్రేమ
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చేసిన ప్రకటనలు మరిచిపోయి గజినీలా ప్రవర్తిస్తున్నారని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలే అమలుచేయలేదని, ఇప్పుడు కొత్తగా మళ్లీ హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే రేవంత్‌రెడ్డికి రైతులమీద ప్రేమ పుట్టుకొచ్చిందని విమర్శించారు. పంటలకు బోనస్ ఇవ్వాలంటే రూ.11 వేల కోట్లకుపైగా అవసరమని, కానీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.19,756 కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకే ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేక బీజేపీపై బురద చల్లుతున్నదని మండిపడ్డారు. మోదీ మళ్లీ గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తావా? అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ చేశారు.

ఓవైసీ బ్రదర్స్‌ను చంపేందుకు కుట్ర

ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16 : మజ్లిస్ పార్టీ ఓవైసీ బ్రదర్స్‌ను చంపేందుకు ప్లాన్ వేస్తున్నారని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హైదరాబాద్ పాతబస్తీలోని రాయల్ క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన తఖ్రీబ్ ఈద్ మిలాబ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతబస్తీలో మజ్లిస్ పార్టీ బలంగా ఉన్నదని, ఓవైసీ బ్రదర్స్ తిరుగులేని శక్తిగా ఎదగడంతో కొందరు కక్ష కట్టారని పేర్కొన్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీ ఇద్దరు అన్నదమ్ములను జైలుకు పంపి వైద్యం పేరిట విషం ఇచ్చి లేదా గన్‌తో కాల్చి చంపేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అయినా తామెవరికీ భయపడేది లేదన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా చివరకు గెలుపు మాదేనన్నారు.

నేత్రపర్వం.. ఎదుర్కోలు ఉత్సవం

- భద్రాద్రిలో తరించిన భక్తజనం
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతి కుమారి
- కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్

స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తున్న సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ) :/ భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వైభవోపేతంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 'ఎదుర్కోలు' ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను రామాలయం నుంచి ఉత్తరద్వారం వద్దకు తీసుకొచ్చి వైకుంఠద్వారం వద్ద శ్రీరామచంద్రమూర్తిని, ఆయనకు అభిముఖంగా సీతమ్మను ఉంచారు. రామయ్య వైపు ఉప ప్రధానార్చకుడు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, సీతమ్మ వైపు ఆస్థాన స్థానాచార్యులు కేతః స్థలశాయి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. సీతమ్మ, రామయ్య గుణగణాలను వర్ణించిన తర్వాత మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ అర్చకులు మాలా పరివర్తన కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తే ఆ ఇంట సకల శుభాలు కలుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా అర్చకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎన్నికల కోడ్ కారణంగా దేవాదాయశాఖ మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు ఎవరూ ఉత్సవాలకు రాలేదు. ప్రభుత్వం తరపున సీఎస్ శాంతికుమారి దంపతులు, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం సీతారాములకు తిరువీధి సేవ నిర్వహించారు.

రాములోరి కల్యాణం లైవ్‌కు గ్రీన్‌సిగ్నల్

భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కమిషన్ షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఇందులో రాజకీయపరమైన అంశాలకు తావులేకుండా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. రాములోరి కల్యాణమహోత్సవం ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కమిషన్ మొదట నిరాకరించింది. కోట్లాదిమంది ప్రజల ఆకాంక్షలు, అనాదిగా వస్తున్న సాంప్రదాయాన్ని కొనసాగించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారానికి అనుమతించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎన్నికల కమిషన్‌ను కోరారు.

గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు

- త్వరలో ప్రజాభవన్‌లో ప్రత్యక వ్యవస్థ ఏర్పాటు
- కార్మికుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్
- రైతు బీమా మాదిరిగా గల్ఫ్ కార్మికులకూ బీమా
- గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజాభవన్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ నుంచి ఎక్కువ మంది గల్ఫ్ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఏజెంట్ల బారిన పడి కొందరు, యాజమాన్యం చేతిలో మరికొందరు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17లోగా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ముసాయిదాను సిద్ధం చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వివిధ రంగాల నుంచి అభిప్రాయాలను తీసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. తద్వారా ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా చర్యలు తీసుకోబోతున్నామని, ఏజెంట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గల్ఫ్ వెళ్లే వారికి వారంపాటు శిక్షణ అందిస్తామని చెప్పారు. రైతు బీమా మాదిరిగా గల్ఫ్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, గల్ఫ్ ఎన్నారై కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీఎం శ్రీరామనవమి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యాన్ని దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

'మద్దతు' లేదు.. మళ్లీ దగా!

- ఐదురోజులు ఆందోళన చేసినా రైతుకు దక్కని ఫలం
- ముఖ్యమంత్రి చెప్పినా మద్దతు ధర కరువే
- సర్కారు వారి పాట క్వింటాకు రూ.1,700
- జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఈ-నామ్ ద్వారానే ట్రేడర్ల కొనుగోళ్లు
- సర్కార్ ప్రకటించిన బోనస్ దేవుడెరుగు
- ఎంఎస్‌పీ కంటే రూ.500 ధర తక్కువే

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిక్షిస్తున్న అధికారులు

జనగామ, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): 'సర్కారు వారి పాట రూ.1,700, రూ.1,823, రూ.1,900 ఏక్ బార్.. దో బార్.. తీన్ బార్'.. ఇదీ రైతుకు దక్కిన ధర. వారం రోజుల ఆందోళన తర్వాత మంగళవారం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-నామ్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లలో అన్నదాత శ్రమకు దక్కిన ప్రతిఫలం ఇది. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2,200 చెల్లించాల్సిన ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి ధర తగ్గించి రైతును దగా చేస్తున్నది. క్వింటాకు రూ.500 బోనస్ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు దేవుడెరుగు అసలు ధరకే రూ.500 చిల్లు పడింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అంగట్లో వేలంపాట ద్వారా వ్యాపారులు నిర్ణయించిన ధరకే తెగనమ్ముకోవాల్సిన పరిస్థితిని సృష్టించారు. 'అన్నదాతకు ఏ కష్టం రానివ్వం.. పండిన ప్రతి గింజకూ మద్దతు ధర చెల్లిస్తాం.. ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయ్'.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కార్చిన మొసలి కన్నీరు. ఎంఎస్‌పీ క్వింటాకు రూ.2,200కు తక్కువకు ఎవరూ కొనొద్దు అంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన తర్వాత మంచి ధరకు అమ్ముకోవచ్చని ఆశపడ్డ రైతును ప్రభుత్వం మళ్లీ దగా చేసింది. కాంగ్రెస్ పాలనలో రైతుకు మద్దతు ధర దక్కడం మిథ్యే అని తేలింది. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజులుగా ధాన్యం రాసుల వద్ద రైతులు ఇంటిల్లిపాది పడిగాపులు కాస్తూ.. రోజూ నిరసనలు, ఆందోళనలు చేసిన ఫలితంగా ఎట్టకేలకు మంగళవారం జనగామ మార్కెట్‌లో ఆన్‌లైన్ కొనుగోళ్లు చేశారు. మార్కెట్ యార్డుకు వస్తే మద్దతు ధర దక్కుతుందని రవాణా ఖర్చులు ఇతరత్రా వ్యయప్రయాసలకు ఓర్చి పడిగాపులు కాసిన రైతు మండే ఎండలో కష్టాన్ని భరించలేక చివరికి తక్కువ ధర అయినా సరే ఈనామ్ ద్వారా అమ్ముకొనేందుకు ముందుకు వచ్చాడు. దీంతో ఉదయం రైతులు మాయిశ్చర్, తాలు, మట్టి తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో ధరలను కోడ్ చేశారు. ట్రేడర్లు, వ్యాపారులు ధాన్యానికి పెట్టిన ధర కనిష్ఠంగా రూ.1,700 నుంచి గరిష్ఠంగా రూ.1,923 అయితే మధ్యస్థంగా దక్కిన ధర రూ.1,823 మాత్రమే. తేమ శాతం ఆధారంగానే ఆన్‌లైన్‌లో ధర నిర్ణయం జరుగుతుందని అధికారులు చెబుతున్నా.. ఒకటి, రెండు రాసుల ప్రామాణికంగా.. నిర్ణీత పద్ధతిలో మాయిశ్చర్ ఉన్న ధాన్యానికి కూడా మద్దతు ధర ఇవ్వడంలేదు. ఈ-నామ్ ట్రేడింగ్‌లోనూ వ్యాపారులు జట్టుకట్టి మరీ ధాన్యం ధరలను నిర్ణయిస్తుంటే నిలువరించాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించారు.

హైకోర్టులో ఇద్దరు జడ్జీలకు పదోన్నతి

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాస రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుకు శాశ్వత న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సీజేఐ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన సుప్రీంకోర్టు కొలీజియం.. ఫిబ్రవరి 13 న తెలంగాణ హైకోర్టు కొలిజీయం చేసిన సిఫారసులపై సంతృప్తిని వ్యక్తం చేసింది.

గర్భిణిపై హోమ్‌గార్డు దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

దాడిలో గాయపడిన మహిళను వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16: బండ్లగూడ సాదత్‌నగర్‌లో నివసించే ఓ హోమ్‌గార్డు వీధి రౌడీలా మారి నిండు గర్భిణి, ఓ మహిళ, చిన్నారిపై దాడి చేశాడు. మంగళవారం బండ్లగూడ ఎస్సై అజీజ్ తెలిపిన వివరాల ప్రకారం, బిహార్‌కు చెందిన గుల్‌నాజ్ బేగం కుటుంబం బండ్లగూడ సాదత్‌నగర్‌లో నివసిస్తున్నది. ఆమెకు ఐదేండ్ల కూతురు పర్వీన్ ఉంది. ఇదే ప్రాంతంలో నివసించే ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హోంగార్డు ఇస్మాయిల్‌కు తొమ్మిదేండ్ల కూతురు ఆయేషా ఉంది. ఈ ఇద్దరు చిన్నారులు ఈ నెల 15న ఇంటి వద్ద ఆడుకుంటుండగా గొడవపడ్డారు. ఈ విషయం ఆయేషా ఇంట్లో చెప్పగా ఇస్మాయిల్ వచ్చి ఏడు నెలల గర్భిణి అని కూడా చూడకుండా గుల్‌నాజ్‌బేగం కడుపుపై బలంగా తన్నాడు. అడ్డుకున్న ఓ మహిళ, చిన్నారిపై దాడి చేశాడు. దాడిలో ఇస్మాయిల్‌కు మరో ఐదుగురు స్నేహితులు కూడా సహకరించడంతో బస్తీ ప్రజలు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బండ్లగూడ పోలీసులు ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. దాడికి సహకరించిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

లోకం పోకడ

ఈ సారి మనకు ధారాదత్తం చేసే కంపెనీలు ఏమేమి వున్నాయో చూడు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	44.6°c	37.4°c
ఆదిలాబాద్	42.9°c	24.4°c
రంగారెడ్డి	42.2°c	20.5°c
మెదక్	41.6°c	22.0°c
నిజామా